

అమెరి'కా'లేజ్

- లిపి మల్లాది



అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో.. అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న ' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..

- సంపాదకుడు

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

మొదటిసారి నేను ఒక మ్యూజిక్ క్లాసులోకి వెళుతున్నప్పుడు ఏదో పరీక్షకి వెళుతున్నంత భయం కలిగింది. ఒక వేళ ప్రొఫెసర్ నన్ను లోపలికి రానివ్వకపోతే నేను ఎంతో బాధపడి ఆ లైబ్రరీ అబ్బాయిని బండ బూతులు తిట్టుకోవాల్సి వస్తుంది. నేను వెళ్ళేసరికి కేవలం ముగ్గురు నలుగురు మాత్రమే ఉన్నారు. రెండు నిమిషాలు ఆగి అది సరైన క్లాస్‌రూమేనా అని వాళ్ళని అడిగాను.

అదే క్లాస్ రూమని, మరో ఐదు నిమిషాల్లో అంతా వచ్చేస్తారని చెప్పారు.

'నేను కేవలం వినడానికి వచ్చావా?' అని ఆసక్తిగా అడిగారు.

'ఔనని' చెప్పాను.

"అయితే మాకు మార్కులు ఎక్కువ ఇవ్వు" అని నవ్వారు.

"నిజంగా నాతో మార్కులు వేయిస్తారా?" అడిగాను.

"ఔను. ప్రొఫెసర్ గ్రేడ్ అరవై శాతం, ఆడియన్స్ గ్రేడ్ నలభై శాతం" అన్నారు.

ఏదో పెద్ద బాధ్యత భుజాల మీద వేసుకున్నట్లుగా అనిపించింది. వారు చెప్పినట్టే మరో ఐదు నిమిషాల్లో క్లాసులో చాలామంది చేరారు. ప్రొఫెసర్ అక్కడ ఉన్న విద్యార్థుల స్నేహితులను చెయ్యి ఎత్తమన్నారు. నేను కాకుండా మరో ఇద్దరు తప్ప మిగతా ఆడియన్స్ చెయ్యెత్తారు. మా ముగ్గురుని 'ఎందుకు వచ్చారని' అడిగారు.

ఒకళ్ళు మరో సెమిస్టర్‌లో ఆ క్లాస్ తీసుకోబోతున్నారని, ఎలా ఉంటుందో చూద్దామని వచ్చానన్నారు. నేను, మరో అమ్మాయి మాత్రం కేవలం ఆసక్తిగా అనిపించడంతో వచ్చామని చెపము. మాకు సంగీతంలో అనుభవం ఉందా? అని అడిగారూ. కొంతమంది ఉందని, మరికొందరు లేదని చెప్పారు.

"మీ స్నేహితులకి పక్షపాతం చూపకండి" అని నవ్వారు.

ఒకతను లేచి "నేను స్నేహితుడి కోసం కాదు, ఎనిమీ కోసం వచ్చాను" అని నవ్వాడు.

ఆవిడ ఆశ్చర్యంగా "ఎక్స్‌ప్లెయిన్ ప్లీజ్" అన్నారు.

"నా రూమ్మేట్ టామ్ ఈ క్లాసులో ఉన్నాడు. అర్ధరాత్రి గిటార్ వాయించి చావగొడతాడు. అందుకే నేను గ్రేడింగ్ చేద్దామని వచ్చాను" అన్నాడు.

అందరం నవ్వాము.

"ఫెయిల్ అయితే మరో సెమిస్టర్ గోల పెరుగుతుంది" అని మరెవరో అన్నారు.

ఇంతలో ప్రొఫెసర్ మా అందరికి ఒక కాగితాన్ని పంచారు.

అది గ్రేడింగ్ పేపర్. దాంట్లో ఎనిమిది ప్రశ్నలు ఉన్నాయి.

1. పాట మీకు లయబద్ధంగా అనిపించిందా?

2. లిరిక్స్ మీకు అర్థమయ్యేలా వినబడ్డాయా, లేక కేవలం వాయిద్యాలు మాత్రమే వినబడ్డాయా?

3. పల్లవినుండి చరణం సాఫీగా వినబడిందా లేక పాట మారినట్టు అనిపించిందా?

4. పాట అర్థం మీకు బాధ కలిగేలా లేదా నొప్పించేలా అనిపించాయా?

5. లిరిక్స్ నుండి మీకు కథ కానీ పద్యం కానీ గాయకులు చెబుతున్నట్లుగా అనిపించిందా?

6. గొంతు కన్నా వాయిద్యం ఎక్కువగా లేదా వాయిద్యం కన్నా గొంతు పెద్దగా వినబడిందా?

7. పాట వినసొంపుగా ఉందా? లేక తలనొప్పి, నవ్వు వచ్చేలా ఉందా?

8. ఈ పాట రేడియోలో వస్తే మళ్ళీ వింటారా లేదా?

ఆ తరవాత కింద ఓవరాల్ పర్ఫామెన్స్ అని ఒకటి నుండి పది అంకెలు ఉన్నాయి. ఏది అనిపిస్తే ఆ నంబర్ చుట్టూ సర్కిల్ గీయమన్నారు. ఎంతో ఉత్సాహంగా పెన్ను తీసుకుని కూర్చున్నాను. ఒకరు గిటార్ వాయిస్తూ పాట మొదలు పెట్టారు. నిజానికి తన గొంతుకి, మొహానికి పోలిక లేకపోవడంతో కాస్త నవ్వు వచ్చింది. తను వాడిన పదాలు కొన్నిటికి అర్థం తెలియకపోవడంతో మేధావి అనుకున్నాను. ప్రొఫెసర్ ఇచ్చిన 'వన్' అని హెడ్డింగ్ ఉన్న పేపరు మీద అన్నీ బావున్నాయని రాసి రేటింగ్ ఎనిమిది ఇచ్చాను.

ఆ తరవాత ఒకమ్మాయి. పియానో వాయిస్తూ పాడింది. ఆ అమ్మాయి పాట మాములుగా మొదలుపెట్టి పై శృతిలో ఆపింది. ఆ రాగం పూర్తికాకుండా సగంలో కొట్టేసినట్టు అనిపించి దాన్ని పేపర్ వెనకమాల 'కామెంట్' అని రాసి ఆరు మార్కులు ఇచ్చాను.

తరువాత అతను రాప్‌లాగా ఏదో పాడాడు. నాకు అర్థంకాకపోవడం, నచ్చకపోవడంతో ఆరు మార్కులు వేసి "ఐ డోంట్ లైక్ రాప్" అని రాసాను.

దాని తరవాత ఒకరు ఫ్లూట్ వాయిస్తుంటే మరొకరు పాడారు. ఫ్లూట్‌కి 10, పాటకి ఏడు అని రాసాను. మొదట నాలుగు అయిపోయాక ఆవిడ బ్రేక్ అని మా కాగితాలు తీసుకుంది. అందరూ బయటకి వెళ్ళారు. దాంతో నేనూ వెళ్ళాను. ఎవ్వరూ తెలియకపోవడంతో తిరిగి గదిలోకి వెళ్ళాను. ప్రొఫెసర్ నేను రాసిన కామెంట్ చదవడం గమనించి 'రైటింగ్ కష్టంగా ఉందా?' అని అడిగాను.

"ఈజ్ దిస్ యువర్ రివ్యూ?" అడిగారు.

'ఔనని'తలూపాను.

"వెరీ ఇంట్రెస్టింగ్" అని ఫ్లూట్‌కి, పాటకి విడిగా ఎందుకు రేటింగ్ ఇచ్చావని అడిగారు.

రెండూ వేరే వ్యక్తులు కాబట్టి ఒకరి కృషి ఇంకొకరికి అడ్డుగా మారకూడదని అలా రాసానని చెప్పాను.

అది సాంగ్ రైటింగ్ క్లాసని, పూర్తి పాటకి ఒకటే రేటింగ్ ఇవ్వాలని చెప్పారు.

కానీ పాడినతని గొంతుకన్నా నాకు ఫ్లూట్ ఇంకా ఎక్కువగా నచ్చింది అన్నాను.

"డు యు ఈట్ పిజ్జా?" అడిగారు.

ఇదేం ప్రశ్న అన్నట్లు "యస్" అన్నాను.

"డు యు రేట్ బ్రెడ్, చీజ్, సాస్ సెపరేట్లీ? ఆర్ డు యు రేట్ పిజ్జా" అడిగారు.

కాస్త సిగ్గుపడి అర్థమయ్యింది అన్నట్లు తలూపాను. ఆ పేపర్ తీసుకుని 'ఆరు' ని సర్కిల్ చేసాను.

అది చూసి ఆవిడ 'ఫ్లూట్‌కి, గాయకుడికి పాటకన్నా ఎక్కువ ఇచ్చావేంటి?' అని అడిగారు.

"ఆ రెండూ విడిగా బావున్నాయి కానీ కలిపితే బాలేదని" చెప్పాను.

ఆవిడ చిన్నగా నవ్వింది.

అందరూ వచ్చాక మరో నలుగురు పాటలు పాడారు. మొదటివాటికన్నా ఇవి వినసొంపుగా ఉన్నాయి. ఒకమ్మాయి వాళ్ళ తాతయ్య గురించి పాటని మొదలుపెట్టి తన కుక్క బొచ్చు చూసినప్పుడు తాతయ్య జుట్టు రాలడం గుర్తొచ్చి బాధ కలుగుతుందని పాడినప్పుడు మాత్రం నేను నవ్వాపుకోలేకపోయాను. దాంతో మరికొందరు కూడా నవ్వారు. ఆ అమ్మాయి కళ్ళు మూసుకుని పాడడంతో నవ్వింది నేనేనని తెలీదు కనక తన పాటయిపోయిన తరవాత చాలాబావుంది. వెరీ హార్ట్ టచ్చింగ్ అని చెప్పాను.

"థాంక్స్, మై గ్రాండ్ పా డైడ్ ఆఫ్ కాన్సర్ లాస్ట్ ఇయర్" అని కళ్ళు తుడుచుకుంది. దాంతో బాధ కలిగి తనకి పది మార్కులు వేసాను.

ఆ క్లాస్ అయిపోయాక లాబ్‌కి వెళ్ళి ఈ సంగతంతా రెయిన్‌కి చెప్పాను. నెక్స్ట్ టైమ్ తను కూడా వస్తానని చెప్పింది. ఎప్పటిలాగాగే మేమిద్దరం మాటల్లో పడి పని చెయ్యలేదు. తను వాళ్ళ ట్రెడిషనల్ మ్యూజిక్ గురించి చెప్పి ఓ పాట పాడింది. నేను పాడే సాహసం చెయ్యకుండా ఎం.ఎస్ సుబ్బలక్ష్మి కచేరీ పాటని యూ ట్యూబ్‌లో పెట్టాను. రెయిన్‌కి చాలా నచ్చిందని లింక్ పంపమంది. కొన్ని వీడియోలు పైపైన చూసి నిజంగా పాడినవా లేక మాడ్యులేషన్ చేసినవా అని అడిగింది. అవి అన్నీ ఆవిడే స్వయంగా టెక్నాలజీ లేకుండా పాడిందని చెప్పాను.

ఇంతలో సయ్యద్ "షీ ఈజ్ వెరీ ఫేమస్" అన్నాడు.

తనకెలా తెలుసని ఆశ్చర్యపోయాను. నా మనసులో మాట విన్నట్లుగా 'ఒక ఆఫ్గన్ మ్యూజిషియన్ పెళ్ళి చేసుకున్న అమ్మాయికి ఈవిడ పేరు పెట్టారు' అని చెప్పాడు.

"సుబ్బలక్ష్మి ఈజ్ హిందు నేమ్" వెంటనే అన్నాను.

ఆ ఆఫ్గన్ వాళ్ళు ఇండియాకి మైగ్రేట్ అయ్యారని, ఆయన హిందువునే పెళ్ళి చేసుకున్నాడని చెప్పాడు. కొద్ది క్షణాలాగి, మేము ఏమీ అనకపోయేసరికి, "ఆ ఆఫ్గన్ ఫ్యామిలీ చాలా లెజెండరి. వాళ్ళు కొత్త ధ్వని యంత్రాన్ని కనిపెట్టారు. ఆయన అదే వాయిస్తాడు" అన్నాడు.

నేను, రెయిన్ ఒకరి ముఖాలు ఒకరం చూసుకున్నాం.

"డూ యూ నో?" నన్ను అడిగింది.

"లేదని" తల అడ్డంగా ఊపాను.

సయ్యద్ తన ఫోన్‌లో యూట్యూబ్‌లో వీడియో పెట్టాడు. అది వింటుండగా "ఇట్ ఈజ్ కాల్డ్ సరోద్. హిజ్ ఆన్సెస్టర్స్ ఇన్వెంటెడ్" అన్నాడు.

ఆ తరవాత నేను 'ఆంజర్ అలీఖాన్' అని ఆ మ్యూజిషియన్ పేరుని గూగుల్ చేసి చూసాను. నేను అనుకున్నట్టు అతను 1940స్‌లో తొభై ఏళ్ళకి చనిపోలేదు. 1990స్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూ చూసి నేను ఎంత పొరబడ్డానో అనుకున్నాను. ఆ ఇంటర్వ్యూలో తెలిసింది అతని భార్యకి మన సుబ్బలక్ష్మి నుండి ఇన్సపైర్ అయ్యి 'సుబ్బలక్షి' అని పేరు పెట్టారని. సయ్యద్ కి ఇంత మ్యూజిక్ నాలెడ్జ్ ఉందని నేను అస్సలు అనుకోలేదు. ఇంతలో ప్రొఫెసర్ వచ్చి మాట్లాడ్డంతో అందరం తిరిగి పని చేయసాగాము. మర్నాడు నన్ను ప్రెజెంటేషన్ ఇవ్వమని, ఈలోగా ప్రాక్టీస్ చేయమని చెప్పారు.

"టుమారో?" టెన్షన్‌గా అడిగాను.

"టు మారో ఈజ్ ట్రయల్. మెయిన్ ప్రెజెంటేషన్ ఈజ్ నెక్స్ట్ వీక్" అన్నారు.

దాంతో కాస్త హాయిగా అనిపించినా, కాస్త భయంకూడా మొదలైంది. వెంటనే స్లైడ్స్ తెరిచి ప్రాక్టీస్ చేయసాగాను. సాయంత్రం ఇంటికి వెళ్ళే సమయానికి వెన్నెల ఫోన్ చేసి డిన్నర్‌కి వెళదామనడంతో డైరెక్ట్‌గా తన ఇంటికి వెళ్ళాను. ఇద్దరం కలిసి చిపోట్లేకి వెళ్ళి కబుర్లు చెప్పుకుంటూ తిన్నాం. ఉదయం ప్రొఫెసర్ చెప్పిన పిజ్జా సంబాషణకి వెన్నెల తెగ నవ్వింది. అప్పటిలానే ఇద్దరం ఆ బౌల్‌ని మొత్తం తినలేకపోవడంతో టుగొ తెచ్చాం. సమయం ఇంకా ఎనిమిదే కావడంతో "సినిమా చూద్దామా గంటసేపు?" అడిగింది.

మర్నాడు ప్రెజెంటేషన్ ఉండడంతో ఉదయానే లేచి ప్రాక్టీస్ చేయాలని చెప్పాను. 'సరే' అని తను నన్ను దింపి ఇంటికి వెళ్ళింది. కానీ నేను వెంటనే నిద్రపట్టక కాసేపు సరోద్ గురించి చదివి, ఆ తరవాత ఆయన పాటలు వింటూ నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS